క్లుప్తంగా

నేడు సర్టిఫికెట్ల పరిశీలన

రాజాం: ప్రభుత్వ ఐటీఐ కళాశాలల్లో మిగులు సీట్లు భర్తీకి ఈ నెల 27వ తేదీన నిర్వహించనున్న కౌన్సెలింగ్‌కు సంబంధించి, స్థానిక ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో సర్టిఫికెట్ల పరిశీలన ఉంటుందని ప్రిన్సిపాల్ బి.భాస్కరరావు బుధవారం తెలిపారు. తమ కళాశాలలో కోపా కోర్సులో 40 సీట్లు, మెకానికల్ డీజిల్ కోర్సులో 12 సీట్లు, సివిల్ కోర్సులో 19 సీట్లు ఖాళీగా ఉన్నాయని, వీటి కోసం 400 మంది వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారన్నారు. సర్టిఫికెట్ల పరిశీలన తర్వాత 27వ తేదీన నిర్వహించే కౌన్సెలింగ్‌లో సీట్లు కేటాయించడం జరుగుతుందన్నారు.

సేంద్రియ ఎరువులతో ఆరోగ్యవంతమైన పంట



సేంద్రియ ఎరువుల తయారీని వివరిస్తున్న వ్యవసాయ శాఖ ఏడీ శ్యామ్‌సుందర్

బొబ్బిలి రూరల్: సేంద్రియ ఎరువులు వినియోగించి, పంటలు సాగు చేసుకుంటే ఆరోగ్యవంతమైన పంటతో పాటు అధిక దిగుబడులు వస్తాయని వ్యవసాయ శాఖ ఏడీ శ్యామ్‌సుందర్ అన్నారు. మండలంలోని కారాడ గ్రామంలో సేంద్రియ ఎరువుల తయారీ, వాటి వినియోగం, ప్రయోజనాలపై బుధవారం అవగాహన కల్పించారు. ప్రస్తుతం అన్నిచోట్ల రసాయనిక ఎరువుల వాడకం విపరీతంగా పెరిగిపోవడం వల్ల నేల నిస్సారమైపోతోందని, తద్వారా పంట దిగుబడి తగ్గిపోవడమే కాకుండా ఆరోగ్యవంతమైన పంట చేతికి రావడం లేదన్నారు. సేంద్రియ ఎరువుల వినియోగం ద్వారా తక్కువ పెట్టుబడి ఖర్చు, అధిక దిగుబడులు, ఆరోగ్యవంతమైన పంట వస్తాయన్నారు.

విద్యాసామగ్రి అందజేత



అందుకున్న నోటుపుస్తకాలు, జ్యామెట్రీ బాక్సులతో విద్యార్థులు

రేగిడి: మండలంలోని ఉనుకూరుకు చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ టి.ప్రణవి ఆ గ్రామ ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు నోటుపుస్తకాలు, పెన్నులు, డ్రాయింగ్ పుస్తకాలు, జ్యామెట్రీ బాక్సులు, పలకలు వంటి విద్యాసామగ్రిని బుధవారం అందజేశారు. తన స్వగ్రామంలోని విద్యార్థులకు తనవంతు సాయం చేయడం ఎంతో సంతోషంగా ఉందని ఆమె అన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు వై.కిశోర్, ఉపాధ్యాయుడు జి.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు క్రీడాపోటీలు

బొబ్బిలి రూరల్: శిక్షా సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని అలజంగి గ్రామ సీబీఎం స్కూల్‌లో విద్యార్థులకు క్రీడాపోటీలు బుధవారం నిర్వహించారు. అనంతరం పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు కె.కృష్ణదాసు తదితరులు పాల్గొన్నారు.

సంతకవిటి: శిక్షా సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని సిరిపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో క్రీడా దినోత్సవం బుధవారం నిర్వహించి, ఖోఖో, వాలీబాల్, కబడ్డీ, త్రోబాల్, డాడ్జ్‌బాల్ పోటీలు నిర్వహించారు. ఆయా పోటీల్లో పాల్గొని, గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు.

బాల్యవివాహాలు చట్టరీత్యా నేరం



అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ పీవో విజయలక్ష్మి

బొబ్బిలి రూరల్: బాల్యవివాహాలు చట్టరీత్యా నేరమని ఐసీడీఎస్ పీవో విజయలక్ష్మి అన్నారు. మండలంలోని కోమటిపల్లి గ్రామ ప్రభుత్వ పాఠశాలలో బాల్యవివాహాలు వల్ల కలిగే అనర్థాలపై బుధవారం అవగాహన కల్పించారు. చిన్నవయసులోనే పెళ్లిళ్లు చేయడం ద్వారా కాన్పు కష్టతరమై, తల్లీశిశువుల్లో ఎవరో ఒకరు గానీ ఒక్కోసారి ఇద్దరూ చనిపోవడానికి అవకాశం ఉందన్నారు. అలాగే చిన్నతనంలో పెళ్లి చేస్తే అవగాహన లేమితో జంటలు విడిపోవడానికి అవకాశం ఎక్కువ ఉంటుందన్నారు. బాల్యవివాహాలను ప్రోత్సహించినా, చేసినా నేరమని, అటువంటి వారిపై కూడా చర్యలకు వెనకాడేది లేదన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు ఎస్.ప్రభావతి, ఎం.శుభలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఖరీఫ్ కలిసొచ్చేనా..?

- గతేడాది ఖరీఫ్ వరి సాగుతో రైతన్నకు లాభాలు
- అప్పట్లో అన్నివిధాలా ఆదుకున్న ప్రభుత్వం
- అన్నదాతకు కలిసొచ్చిన ఆర్‌బీకే సేవలు
- ధీమానిచ్చిన ఈ–క్రాప్ నమోదు, పంటల బీమా
- ఎకరానికి 24 బస్తాలకు పైగా ధాన్యం దిగుబడి
- ఈ ఏడాది ప్రభుత్వ సాయం లేకుండా ఖరీఫ్ సాగు
- దిగుబడి పైనే రైతాంగం ఆశలు



వరి ఉబాలు వేస్తున్న మహిళా కూలీలు

రాజాం:

ఖరీఫ్ వరి సాగుకు రైతులు సన్నద్ధమయ్యారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో అన్నిచోట్ల వరి ఉబాలు ప్రారంభమవుతున్నాయి. వరినారులో పెద్దగా పెరుగుదల లేకపోయినప్పటికీ వాతావరణం అనుకూలంగా ఉండడంతో రైతులు పొలాలను సిద్ధం చేసి, వరినాట్లు వేసుకుంటున్నారు. గతేడాది ఖరీఫ్ సీజన్‌లో జిల్లాలో మొత్తం 93,820 హెక్టార్లలో వరిపంటను సాగుచేశారు. ఎక్కువగా శ్రీధృతి రకం పంటను సాగుచేయడం, ఎకరా సాగులో జిల్లా వ్యాప్తంగా సగటున 24 బస్తాల వరకు ధాన్యం దిగుబడి రావడంతో అన్నదాతకు కలిసివచ్చింది. ఎకరం సాగులో రూ.12 వేల నుంచి రూ.16 వేల వరకు ఖర్చులు పోనూ రైతుకు రూ.20 వేల మేర ఆదాయం మిగిలింది. సకాలంలో వైఎస్సార్ రైతు భరోసా పథకం కింద పెట్టుబడి సాయం చెల్లింపు, రైతు మిత్ర గ్రూపుల ద్వారా వ్యవసాయ వస్తుసామగ్రి రైతుకు అందుబాటులో ఉంచడం, సకాలంలో ధాన్యం కొనుగోలు, 15 రోజుల్లో బిల్లుల చెల్లింపు అంతా ఓ పండగలా సాగింది. ఈ నేపథ్యంలో అన్నదాతలు కష్టంతో కాకుండా ఇష్టంతో గత ఖరీఫ్‌లో వరి పంటను సాగుచేశారు. అంతకుమించి లాభాలు పొందారు.

ఈ ఏడాది ఇలా..

ఈ ఏడాది జిల్లా వ్యాప్తంగా 90,058 హెక్టార్లలో ఖరీఫ్ సాగును వ్యవసాయ శాఖ లక్ష్యంగా చేసుకుంది. ఇప్పటివరకు 3,153 హెక్టార్లలో వరినాట్లు పూర్తయ్యాయి. మిగిలిన పంటపొలాల్లో కూడా రైతులు నాట్లు ముమ్మరం చేస్తున్నారు. ఈ ఏడాది ముందుగానే వర్షాలు కురవడంతో పాటు సాగునీటి కాలువల ద్వారా కూడా ప్రస్తుతం నీటి ప్రవాహం ఉండడంతో అన్నదాత సాగుకు ముందుకువచ్చాడు. ఈ ఏడాది కూడా గతంలో పంపిణీ చేసిన మాదిరిగానే ఎంటీయూ–1121(శ్రీధృతి) రకం వరిని అధికమంది సాగుచేసేందుకు సిద్ధం కాగా దాని తర్వాతి స్థానంలో సాంబమసూరి, సంపద స్వర్ణ రకాల పంటలు ఉన్నాయి. గతంలో ఇచ్చిన సాంబమసూరి (బీపీటీ–5204) స్థానంలో ఈ ఏడాది ఎంటీయూ–1224 రకాన్ని పలుచోట్ల ఇచ్చారు. అయితే ఈ ఏడాది ఖరీఫ్ సాగుకు సంబంధించి, రైతుకు ఇంత వరకు రైతు భరోసా సాయం అందలేదు.

‘గుర్తింపు’ తప్ప రుణం లేదు..

కౌలురైతులకు గుర్తింపుకార్డులు తప్ప ఏ రకమైనా రుణమూ అందివ్వలేదు. గతంలో ఉండే రైతు ఉత్పత్తి సంఘాలు ప్రస్తుతం ఎక్కడా కనిపించడం లేదు. వీటికి తోడు ఈ–క్రాప్ నమోదు చేయకపోవడం, పంటల బీమాపై స్పష్టత ఇవ్వకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ ఏడాది ఖరీఫ్ గతేడాది మాదిరి కలిసొచ్చేనా అని అనుకుంటున్నారు. వరి నారుమడులు ఏర్పాటు, ఉబాలు వేసేందుకు ఎకరానికి రూ.4,500 పెట్టుబడి అవుతుండగా, ఇంతవరకు ప్రభుత్వం నుంచి ఎటువంటి సాయం అందకపోవడం పట్ల రైతాంగం వాపోతోంది. ఈ పరిస్థితుల్లో పంట పండి, చేతికందే ధాన్యం విక్రయించడం ద్వారా మదుపులు పోను వచ్చే ఆదాయం తప్ప, ప్రభుత్వ ప్రోత్సాహకం, సంక్షేమ పథకాల ద్వారా వచ్చే ఆదాయం కనిపించడం లేదని అంటున్నారు. కొత్త ప్రభుత్వ హయాంలో రైతుకు లాభమా నష్టమా అనేది తెలియాలంటే మరో మూడు నెలలు ఎదురు చూడాలని పలువురు రైతులు అభిప్రాయపడుతున్నారు.

స్పష్టత లేదు..



ఖరీఫ్ సాగుకు సంబంధించి, రైతుకు అందాల్సిన ప్రభుత్వ సాయంపై ఇంత వరకు స్పష్టత లేదు. రైతు భరోసా పథకం ఇచ్చి ఉంటే బాగుండేది. పెట్టుబడికి అది పనికి వచ్చేది. ఇంతవరకు ఇవ్వలేదు. భవిష్యత్‌లో ఇస్తారో లేదో ఎప్పుడిస్తారో తెలీదు. ధాన్యం కొనుగోలు ఇంకెలా ఉంటుందో చూడాలి.

–వంజరాపు విజయ్‌కుమార్, బొమ్మినాయుడువలస, రాజాం మండలం.

బీమా లేదు..



గతంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పంటల బీమా ఇచ్చేది. ఇప్పుడు కొత్తగా వచ్చిన కూటమి ప్రభుత్వం ఎటువంటి ప్రకటన చేయలేదు. పంటల బీమా లేకుంటే పండిన పంటకు నష్టం వాటిల్లితే పట్టించుకునే దిక్కు ఉండదు. రైతు భరోసా పథకం సాయం కూడా లేకపోవడంతో చేతిమదుపులు పెట్టాం. సకాలంలో ధాన్యం కొనుగోలు కూడా చేయకుంటే తీవ్రంగా నష్టపోతాం.

–బెవర తవిటినాయుడు, రైతు, వన్నలి, రేగిడి మండలం.

అప్రమత్తంగా ఉండాలి



ఇంటింటికీ వెళ్లి, సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పిస్తున్న పంచాయతీ కార్యదర్శి దిలీప్

రాజాం సిటీ: వర్షాల కారణంగా మలేరియా, డెంగీ, టైఫాయిడ్, డయేరియా వంటి సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పంచాయతీ కార్యదర్శి దిలీప్ సూచించారు. బుధవారం మండలంలోని ఒమ్మి గ్రామంలో సచివాలయ సిబ్బందితో కలిసి ఇంటింటికీ వెళ్లిన ఆయన సీజనల్ వ్యాధులు, వాటి బారినపడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ప్రతిఒక్కరూ కాచి చల్లార్చిన నీటిని తాగాలని, ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా చూడాలని తెలిపారు.

అన్నా క్యాంటీన్ల ఏర్పాటుకు నిధుల మంజూరు

బొబ్బిలి: అన్నా క్యాంటీన్‌ల ఏర్పాటుకు రూ.కోటి మంజూరైనట్లు ప్రజారోగ్య శాఖ ఈఈ దక్షిణామూర్తి తెలిపారు. స్థానిక పట్టణంలో జరుగుతున్న అన్నా క్యాంటీన్ మరమ్మతు పనులను ఆయన బుధవారం పరిశీలించారు. జిల్లాలో ఆరు అన్నా క్యాంటీన్ల ఏర్పాటుకు నిధులు మంజూరయ్యాయని, వీటిలో మూడింటిని ఆగస్టు 15వ తేదీన ప్రారంభిస్తామన్నారు. మిగతా మూడింటిని సెప్టెంబరు నెలాఖరులోగా అందుబాటులోకి తీసుకువస్తామన్నారు.

వరినాట్లు వేయడంలో జాగ్రత్తలు పాటించాలి



తెర్లాం: కుసుమూరులో వరినాట్లు వేయడంపై అవగాహన కల్పిస్తున్న వీఏఏ వెంకటేష్



రేగిడి: వన్నలిలో వరినాట్లు చిగుర్లు తొలగింపుపై అవగాహన కల్పిస్తున్న ఏవో మురళీకృష్ణ

తెర్లాం: వరినాట్లు వేయడంలో జాగ్రత్తలు పాటించాలని ఏవో జి.సునీల్‌కుమార్ సూచించారు. మండలంలోని కుసుమూరు రైతు సేవా కేంద్రంలో వరినాట్లు ఏ విధంగా వేస్తే పంట బాగా పండుతుందన్న అంశంపై రైతులకు బుధవారం అవగాహన కల్పించారు. వరినాట్లు వేసే ముందు వరినారు చివర్లను కత్తిరించి, నాటాలని తెలిపారు. ప్రతీ రెండు మీటర్లకు 20 సెంటీమీటర్ల కాలిబాటను ఉంచుకోవాలన్నారు. ఈ విధంగా నాటడం ద్వారా వరిపంటను ఆశించే సుడిదోమను నివారించవచ్చన్నారు.

రేగిడి: మండలంలోని వన్నలి, అక్కన్నఅగ్రహారం, అంబకండి గ్రామాల్లో నీటమునిగిన వరి పంటను ఏ విధంగా కాపాడుకోవాలో ఏవో మురళీకృష్ణ రైతులకు వివరించారు. పొలాల్లోని నీటిని తొలుత బయటకు పంపాలని, 25 కిలోల యూరియా, 40 కిలోల డీఏపీ, 15 కిలోల పొటాష్‌ను ఎకరా పొలంలో వేయాలన్నారు. అనంతరం వరినాట్లు వేసుకోవడంపై అవగాహన కల్పించారు.

ఉపాధి శిక్షణను సద్వినియోగం చేసుకోండి

రాజాం సిటీ: స్థానిక ప్రభుత్వ ఐటీఐలో నిరుద్యోగ యువతకు అందించనున్న స్వల్పకాలిక ఉపాధి శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ బి.భాస్కరరావు బుధవారం ఓ ప్రకటనలో కోరారు. యువత, మహిళల్లో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగుపరిచేందుకు ఈ నెల 31వ తేదీ నుంచి డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్ ఉచిత శిక్షణను ప్రారంభించనున్నామన్నారు. పదో తరగతి, ఇంటర్మీడియట్, గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన వారు అర్హులని, ఆసక్తి ఉన్న అభ్యర్థులంతా ఆధార్‌కార్డు, పదో తరగతి మార్కుల లిస్టు జిరాక్స్, పాస్‌పోర్టు సైజు ఫొటోతో కళాశాలను సంప్రదించాలని కోరారు. శిక్షణ అనంతరం ప్లేస్‌మెంట్ అవకాశాలు కల్పించనున్నామని డీఎస్‌డీవో గోవిందరావు తెలిపారు. మరిన్ని వివరాలకు ఫోన్ నంబర్లు 7286042743, 8121450657ను సంప్రదించాలన్నారు.

అనాథ విద్యార్థులకు సైకిళ్ల వితరణ



సైకిళ్లు అందుకున్న విద్యార్థులతో సంస్థ సభ్యులు

బాడంగి: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న పలువురు అనాథ విద్యార్థులకు బెంగళూరుకు చెందిన వీకే యూనివర్సల్ ఫ్యామిలీ ఫౌండేషన్ (వసుధైక కుటుంబం అనే స్వచ్ఛంద సంస్థ) సైకిళ్లను వితరణ చేసింది. ఇదే సంస్థ సభ్యుడు అమెరికాలో స్థిరపడిన రెల్ల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో 15 మంది విద్యార్థులకు రూ.లక్ష విలువైన సైకిళ్లను బుధవారం అందజేశారు. సుదూర ప్రాంతాల నుంచి ఆటోలు, కాలినడకన వస్తున్న విద్యార్థులు ఇబ్బందులు పడకుండా తమవంతు సాయంగా వీటిని అందజేసినట్లు సంస్థ సభ్యులు తెలిపారు. గతంలో ఇదే తరహా కార్యక్రమం కాకినాడ, శ్రీకాకుళం జిల్లాల్లో కూడా చేశామన్నారు. కార్యక్రమంలో ఎంఈవోలు లక్ష్మణదొర, రాజేశ్వరి, ప్రధానోపాధ్యాయుడు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల కొరతపై నివేదిక సమర్పించండి



విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకుంటున్న ఎంఈవో తిరుమలప్రసాద్

రామభద్రపురం: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఇంగ్లిష్ భాషోపాధ్యాయుల కొరతతో పాటు అక్కడి హైస్కూల్ ప్లస్(జూనియర్ కళాశాల)లో నెలకొన్న అధ్యాపకుల కొరతపై నివేదిక సమర్పించాలని ఎంఈవో తిరుమలప్రసాద్‌ను డీఈవో ప్రేమ్‌కుమార్ ఆదేశించారు. ఇక్కడి పాఠశాల, కళాశాలల్లో బోధనా సిబ్బంది కొరతపై ఈ నెల 23వ తేదీన సాక్షి దినపత్రికలో చదువులు సాగేదెలా..? శీర్షిక పేరిట వెలువడిన కథనానికి డీఈవో స్పందించి, ఆదేశాలు జారీ చేయడం విశేషం. ఈ మేరకు ఎంఈవో బుధవారం పాఠశాలను సందర్శించి, సిబ్బంది కొరత కారణంగా విద్యార్థులు పడుతున్న కష్టాలపై ఆరాతీశారు. విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రుల డిమాండ్‌లు, అభిప్రాయాలు సేకరించారు. త్వరలోనే సిబ్బంది నియామకం జరిగేలా చర్యలు తీసుకుంటామని, అంతవరకు ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలని ప్రధానోపాధ్యాయుడు కామేశ్వరరావుకు ఎంఈవో సూచించారు.

దోమల నివారణకు ఫాగింగ్



రేగిడి: సంకిలిలో ఫాగింగ్ చేయిస్తున్న సర్పంచ్ పట్టాభి



రాజాం: ఫాగింగ్ యంత్రాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో శ్రీనివాసరావు

రేగిడి: మండలంలోని సంకిలి, చిన్నయ్యపేట, బొడ్డవలస గ్రామాల్లో దోమల నివారణకు ఫాగింగ్ చర్యలు బుధవారం చేపట్టారు. వర్షాకాలం నేపథ్యంలో దోమల కారణంగా మలేరియా, డెంగీ వంటి విషజ్వరాలు ప్రబలే అవకాశాలు ఉన్నందున ఈ చర్యలు చేపడుతున్నట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ బి.పట్టాభి పాల్గొన్నారు.

రాజాం: దోమల నివారణకు ఫాగింగ్ చర్యలు తప్పనిసరిగా చేపట్టాలని పంచాయతీ కార్యదర్శులకు ఎంపీడీవో వి.శ్రీనివాసరావు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద పలు పంచాయతీలకు అందించిన ఫాగింగ్ యంత్రాలను ఆయన బుధవారం పరిశీలించారు. అనంతరం వాటితో ట్రయల్ రన్ వేసి, వాటిని పంచాయతీ కార్యదర్శులకు అప్పగించారు. ప్రతీ గ్రామ పంచాయతీలో పారిశుధ్య పనులు ముమ్మరం చేయాలని, ప్రజలు సీజనల్ వ్యాధుల బారినపడకుండా జాగ్రత్త వహించాలని సూచించారు.

ప్రజాభాగస్వామ్యంతోనే సీజనల్ వ్యాధులకు అడ్డుకట్ట



రామభద్రపురం: మాట్లాడుతున్న ఎంపీడీవో ఈశ్వరమ్మ

రామభద్రపురం: సీజనల్ వ్యాధులకు అడ్డుకట్ట వేయాలన్నా, ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణం జరగాలన్నా అది ప్రజా భాగస్వామ్యంతోనే సాధ్యమని ఎంపీడీవో ఈశ్వరమ్మ అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో పీహెచ్‌సీ వైద్యాధికారి దిలీప్ కుమార్, ఈవోపీఆర్‌డీ వెంకటరమణ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ పార్వతిలతో కలిసి పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లతో సమీక్ష సమావేశం బుధవారం నిర్వహించారు. ఓడీఎఫ్ ప్లస్‌లో భాగంగా గ్రామాల్లో గతంలో నిర్మించిన మరుగుదొడ్లు ఎన్ని ఉన్నాయి.. వాటిలో ఎన్ని వినియోగంలో ఉన్నాయి.. ఇంకెన్ని నిర్మించాల్సి ఉందన్న అంశాలపై సర్వే చేసి, వివరాలను సంబంధిత యాప్‌లో నమోదు చేయాలని సూచించారు. వారం రోజుల్లోగా సర్వే పూర్తి చేయాలన్నారు. అలాగే గ్రామాల్లో పారిశుధ్య చర్యలు ముమ్మరం చేయాలని, దోమల నివారణకు ఫాగింగ్ చర్యలు చేపట్టాలని తెలిపారు. ప్రజలంతా వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత కూడా పాటించి, తద్వారా సమాజ ఆరోగ్యానికి కృషి చేసేలా చైతన్యం చేయాలన్నారు. కార్యక్రమంలో ఏపీఎం రత్నకుమార్ పాల్గొన్నారు.

వారంలోగా సర్వే పూర్తి చేయండి

రాజాం సిటీ: గ్రామాల్లో ఓడీఎఫ్ ఇళ్ల సర్వేను వారం రోజుల్లోగా పూర్తిచేయాలని ఎంపీడీవో వి.శ్రీనివాసరావు ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో బుధవారం సమావేశమైన ఆయన ఇప్పటికే గ్రామాల్లో చేపట్టిన సర్వే తీరుపై సమీక్షించారు. ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లంతా ప్రతిరోజూ ఇంటింటికీ వెళ్లి, సర్వేను వేగవంతం చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ జగన్, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

కంట్రోల్ రూమ్ ఏర్పాటు

బొబ్బిలి: వర్షాలు కురుస్తున్న కారణంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం, విద్యుత్ ప్రమాదాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని విద్యుత్‌శాఖ ఏఈ సాంబశివరావు ఓ ప్రకటనలో బుధవారం తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు బొబ్బిలి పట్టణంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. అత్యవసర సమయాల్లో ఫోన్ నంబర్ 9490610122ను సంప్రదించి, సహాయం పొందవచ్చన్నారు.

పౌష్టికాహారం పంపిణీ

బాడంగి: స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో బొబ్బిలి రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో గర్భిణులకు బుధవారం పౌష్టికాహారం పంపిణీ చేశారు. మాతాశిశు ఆరోగ్య సంరక్షణలో భాగంగా గర్భిణులకు వేరుశనగ చెక్కీలు, ఖర్జూరం, బాదంపప్పు వంటివి అందజేసినట్లు క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాసరావు, ప్రవీణ్‌కుమార్ తెలిపారు. అనంతరం గైనకాలజిస్ట్ ప్రత్యూష గర్భిణులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.

ఆయుర్వేద వైద్యశిబిరం

రేగిడి: మండలంలోని అంబకండి గ్రామంలో ఉచిత ఆయుర్వేద వైద్యశిబిరం బుధవారం నిర్వహించారు. ఆయుర్వేద వైద్యాధికారి ఎం.సునీల్‌కుమార్ శిబిరానికి హాజరైన రోగుల సమస్యలు తెలుసుకుని, ఉచితంగా మందులు అందజేశారు. ప్రతిఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలని తద్వారా ఆరోగ్యం కాపాడుకోవచ్చన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ఎస్.గోవిందనాయుడు, ఎంపీటీసీ పి.సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయోద్యమ పితామహుడికి ఘనంగా నివాళులు



బాడంగి: వెంకటరమణయ్య చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పిస్తున్న లైబ్రేరియన్ దుర్గాప్రసాద్, తదితరులు

తెర్లాం: స్థానిక శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయోద్యమ పితామహుడు అయ్యంకి వెంకటరమణయ్య 134వ జయంతి బుధవారం నిర్వహించారు. లైబ్రేరియన్ సీహెచ్ కృష్ణమూర్తి, పాఠకులు కలిసి వెంకటరమణయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి, ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన సేవలను వక్తలు కొనియాడారు. ప్రజలను విజ్ఞానవంతులను చేసి తద్వారా సమాజ సమస్యల పట్ల చైతన్యవంతులను చేయడమే లక్ష్యంగా గ్రంథాలయోద్యమాన్ని వెంకటరమణయ్య ప్రారంభించారని తెలిపారు. ఆయన కృషి ఫలితంగా ఏర్పడిన గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

బాడంగి: స్థానిక శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయోద్యమ పితామహుడు అయ్యంకి వెంకటరమణయ్య 134వ జయంతి బుధవారం ఘనంగా నిర్వహించారు. లైబ్రేరియన్ ఆర్.దుర్గాప్రసాద్, పింద్రంగివలస పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రవిబాబు, విద్యార్థులు కలిసి వెంకటరమణయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు.

మొక్కల పెంపకంతోనే పర్యావరణ పరిరక్షణ

వంగర: మొక్కల పెంపకంతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమని ప్రధానోపాధ్యాయుడు రమణయ్య అన్నారు. మండలంలోని కొప్పరవలస ప్రాథమిక పాఠశాలలో ఆయన తన సొంత డబ్బులతో మొక్కలు కొనుగోలు చేసి బుధవారం నాటారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ తమవంతు బాధ్యతగా మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు తోడ్పడాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు బి.వి.శ్రీరామ్మూర్తి, యోగేంద్ర, అభినేష్ తదితరులు పాల్గొన్నారు. స్థానిక వివేక్ మాస్టర్ మైండ్స్ హైస్కూల్‌లో ప్రిన్సిపాల్ బెవర ఈశ్వరరావు మొక్కలు నాటారు.

అక్రమ నిర్మాణాలపై స్పందించాలి

బొబ్బిలి: స్థానిక పట్టణంలోని ఏఎంసీ వద్ద ఉన్న భైరిసాగరం చెరువుగట్టు పక్కన ఉన్న లేఅవుట్‌లో ఉన్న బఫర్ జోన్‌లో అక్రమంగా చేపడుతున్న నిర్మాణాలపై అధికారులు స్పందించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ఇప్పటికే ఇక్కడి అక్రమాలపై ఆన్‌లైన్‌లో అధికారులకు ఫిర్యాదులు కూడా చేయడం జరిగిందని, అధికారులు అక్రమాలను అడ్డుకుంటామని హామీ సైతం ఇచ్చారని అయినా యథేచ్ఛగా నిర్మాణాలు కొనసాగుతున్నాయన్నారు. ఇప్పటికైనా అధికారులు చర్యలను వేగవంతం చేసి, అక్రమార్కులపై కఠిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

ఆధార్ నమోదు కేంద్రం పరిశీలన



రామభద్రపురం: ఆధార్ నమోదు కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ సులోచనరాణి



రాజాం: బొద్దాం సచివాలయంలో ఆధార్ సేవలు అందిస్తున్న దృశ్యం



సంతకవిటి: ఆధార్ సేవలు పరిశీలిస్తున్న ఎంపీడీవో పైడితల్లి

రామభద్రపురం: స్థానిక పాత తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహిస్తున్న ఆధార్ నమోదు కేంద్రాన్ని తహసీల్దార్ సులోచనరాణి బుధవారం పరిశీలించారు. ఆధార్‌కార్డులో మార్పులు, చేర్పులు, సవరణలు చేస్తామని ఎవరినైనా మభ్యపెడితే అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఆధార్ సేవా కేంద్రాల్లోనే ఆధార్‌కార్డులోని డేటా సవరణలు చేసుకోవాలని తెలిపారు. సిబ్బంది కూడా ఆధార్ సేవల కోసం వచ్చే ప్రజలను ఇబ్బందులకు గురిచేయకుండా సకాలంలో వారి సమస్యను పరిష్కరించాలని సూచించారు.

బొబ్బిలి రూరల్: మండలంలోని అన్ని గ్రామ సచివాలయాల్లో విడతల వారీగా ఆధార్ నమోదు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని ఎంపీడీవో పి.రవి కుమార్ తెలిపారు. ఇదే విషయమై ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడుతూ ప్రస్తుతం చింతాడ, కోమటిపల్లి గ్రామాల్లో ఆధార్ సేవా కేంద్రాలు ఏర్పాటు చేశామని, వీటిల్లో ఆధార్‌కార్డులో సవరణలు, మార్పులు, చేర్పులు చేయడం జరుగుతుందని, ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఆధార్ స్పెషల్ డ్రైవ్.

రాజాం: మండలంలోని బొద్దాం గ్రామ సచివాలయంలో ఆధార్ స్పెషల్ డ్రైవ్ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. గ్రామస్తులు సచివాలయాన్ని సంప్రదించి, ఆధార్‌కార్డులో మార్పులు, చేర్పులతో పాటు తప్పొప్పులను సవరించుకున్నారు. అనంతరం జారీచేసిన ఆధార్ ధ్రువీకరణ పత్రాలను ఆధార్ ఇన్‌చార్జ్ పార్వతి పరిశీలించారు. కార్యక్రమంలో వీఆర్‌వో కె.వి.రమణమ్మ, పంచాయతీ కార్యదర్శి ఎస్.నాగమణి, డిజిటల్ అసిస్టెంట్ స్వాతి తదితరులు పాల్గొన్నారు.

సంతకవిటి: స్థానిక సచివాలయంలో నిర్వహిస్తున్న ఆధార్ స్పెషల్ డ్రైవ్ సేవలను ఎంపీడీవో జి.పైడితల్లి బుధవారం పరిశీలించారు. ఆధార్‌కార్డులోని పేర్లలో మార్పులు, చేర్పులు, సవరణల కోసం ప్రత్యేకంగా నిర్వహిస్తున్న ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. కార్యక్రమంలో మండల పరిషత్ పరిపాలనాధికారి ఎస్.రఘునాధాచారి, ఈవోపీఆర్‌డీ పుష్పాంజలి పాల్గొన్నారు.

తెర్లాం: మండలంలోని డి.గదబవలస గ్రామ సచివాలయంలో ఆధార్ స్పెషల్ డ్రైవ్ సేవలను సర్పంచ్ జావాన రమేష్‌నాయుడు, పంచాయతీ కార్యదర్శి మల్లిఖార్జునరావు బుధవారం పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఇంతవరకు ఆధార్‌కార్డు లేని వారంతా సచివాలయానికి వచ్చి, ఆధార్ నమోదు చేసుకోవాలన్నారు. ప్రభుత్వ పథకాల కోసం ఆధార్‌కార్డు ఎంతో అవసరమని, ప్రతిఒక్కరూ దీన్ని దృష్టిలో ఉంచుకుని ఆధార్ సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.